712) లలిత/హిందోళ

ప॥ ఆదివిష్ణు వీతడే యటరమ్మ। ఆదిగొని భూభార మణచీనోయమ్మా॥

చ॥ చందురునుదయవేళా సవరేతిరికాడ। కందువ దేవకి బిడ్డగనెనమ్మా।
పొందుగ బ్రహ్మాదులు పురుటింటివాకిటను। చెంది బాలుని నుతులు సేసేరోయమ్మా॥

చ॥ వసుదేవుని యెదుట వైకుంఠనాథుడు। సిసువై యవతరించీ చెలగీ నమ్మా।
ముసిముసినవ్వులతో మునులకు ఋషులకు। యిసుమంతవాడభయమిచ్చీనమ్మా॥

చ॥ కన్నతల్లిదండ్రులకు కర్మపాశము లూడిచి। అన్నిటా రాకాసిమూక లణచీనమ్మా।
వున్నతి శ్రీవేంకటాద్రినుండి లక్ష్మీదేవితోడ। పన్ని నిచ్చకల్యాణాల బరగీనమ్మా॥